

మానసిక సమస్యలపై 'టెలీ మానస్' సేవలు

శ్రీకాకుళం అర్బన్ : విజయవాడ సిద్ధార్థ వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన 'టెలీ మానస్' కేంద్రం ద్వారా మానసిక సమస్యలతో బాధపడే వారికి సలహాలు అందించనున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి ఒక ప్రకటనలో తెలిపారు. మానసిక సమస్యలున్న వారు 14416 లేదా 180089114416 టోల్ ఫ్రీ నంబర్లకు కాల్ చేసి ఉచిత టెలీ కౌన్సెలింగ్ సౌకర్యాన్ని పొందవచ్చని పేర్కొన్నారు. ఉదయం ఎనిమిది నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు టెలీ మానస్ కేంద్రం పనిచేస్తుందని తెలిపారు. సుశిక్షితులైన కౌన్సిలర్లు టెలిఫోన్ ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించి అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తారని పేర్కొన్నారు. మానసిక ఒత్తిళ్లు, సమస్యలతో ఎక్కువ మంది బాధపడుతున్నారని తెలిపారు. పరీక్షలు, ఉద్యోగాన్వేషణ సమయాల్లో విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నట్లు పేర్కొన్నారు.

పల్లె గూటికి పండగ

ప్రజాశక్తి - శ్రీకాకుళం, ఆమదాలవలస

పండగ అంటే గుర్తుకొచ్చేది పల్లెటూరు. అందులోనూ సంక్రాంతి పండగ అంటే పల్లె పండగని ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. సంక్రాంతి పండగ నేపథ్యంలో ఎక్కడెక్కడో ఉన్న జిల్లావాసులు స్వస్థలాలకు రెక్కలు కట్టుకొని వాలుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలకు సెలవులు కావడం, బ్యాంకులు మూతపడడంతో శ్రీకాకుళం నగరమూ బోసిపోయే అవకాశాలున్నాయి. గ్రామాలకు తరలివెళ్తున్న ప్రయాణికులతో బస్సులు కిటకిటలాడుతున్నాయి. నిన్న, మొన్నటి వరకూ వెలవెలబోయిన తెలుగు వెలుగు బస్సులు నేడు జనంతో కిక్కిరిసిపోతున్నాయి. ఈ బస్సులను ప్రయాణికుల రద్దీ దృష్ట్యా దూర ప్రాంతాలకు ఎక్స్‌ప్రెస్, ప్రత్యేక సర్వీసులుగా వినియోగిస్తున్నారు. ఇప్పటికే రెండు రోజులుగా జనం రద్దీతో కిటకిటలాడుతున్న ఆర్‌టిసి కాంప్లెక్స్‌లు గురువారం మరింత కిక్కిరిసింది. దూర ప్రాంతాలకు తెలుగు వెలుగు బస్సులను నడుపుతుండడంతో గ్రామీణ ప్రాంతాల సర్వీసులకు కొంత అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రయివేటు ట్రావెల్స్‌ను ఆశ్రయించి ప్రయాణికులు స్వగ్రామాలకు చేరుకుంటున్నారు.

జిల్లా అభివృద్ధికి అపారమైన వనరులు, పుష్కలమైన అవకాశాలున్నా పాలకుల నిర్లక్ష్యం వల్ల జిల్లా వెనుకబాటుకు గురైంది. దీంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కొరవడ్డాయి. అటు పారిశ్రామికంగానూ వెనుకబడింది. దీంతో జిల్లాలో ఎక్కువ మంది కూలి పనుల కోసం విశాఖ, హైదరాబాద్, చెన్నై, గుంటూరు, ప్రకాశం, విజయవాడ తదితర ప్రాంతాలు, ఇతర రాష్ట్రాలకు వలస వెళ్తున్నారు. ఎక్కువగా భవన నిర్మాణం, హౌస్ కీపింగ్, దుకాణాల్లో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

వీరంతా ఏడాది పొడుగునా జరిగే కొన్ని పండగలకు వచ్చి వెళుతుంటారు. వీరితో పాటు ఉద్యోగ, వ్యాపార రీత్యా పలు ప్రాంతాల్లో స్థిరపడిన వారూ సంక్రాంతికి వచ్చి, కుటుంబసభ్యులతో గడిపే ఆనవాయితీ ఉంది. ఇతర పండగలకు రాకపోయినా, సంక్రాంతికి తప్పక వచ్చేందుకు ఎక్కువమంది ఇష్టపడతారు. వీరిలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారంతా రైళ్లను ఎక్కువగా ఆశ్రయిస్తున్నారు. రైల్వేస్టేషన్ల నుంచి వందలాది మంది వలస కార్మికులు దిగుతున్నారు. మరోవైపు విశాఖ నుంచి శ్రీకాకుళం, టెక్కలి, పలాస, సోంపేట, ఇచ్ఛాపురం వంటి ముఖ్య కేంద్రాలకు వెళ్లే ఆర్‌టిసి బస్సులు ఖాళీగా ఉండడం లేదు. జిల్లా కేంద్రం నుంచి గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే పల్లె వెలుగు బస్సులూ ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. ఇదే అదునుగా ప్రైవేటు వాహనదారులు ఇష్టానుసారంగా ఛార్జీలు పెంచుతున్నారు. మితిమీరిన వేగం, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో జనం ముందుకు సాగాల్సి వస్తోంది. చిన్నపిల్లలు, వృద్ధులు, లగేజీలతో బయలుదేరిన వారి ఇబ్బందులు వర్ణణాతీతం. శ్రీకాకుళం నగరంలోని స్థానికేతరులూ తమ సొంత ఊళ్లకు బయలుదేరుతున్నారు. దీంతో ఆర్‌టిసి కాంప్లెక్స్ , రైల్వేస్టేషన్లు జనంతో కళకళలాడుతున్నాయి.



శ్రీకాకుళం ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో బస్సు ఎక్కేందుకు పోటీ పడుతున్న ప్రయాణికులు



ఆమదాలవలస రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

సర్దుబాటు బదిలీలు వద్దు

- వెంటనే రద్దు చేయాలి : ఫ్యాప్టో
- డిఇఒ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ కోర్టులో ఉందన్న నెపంతో సర్వీస్ నిబంధనలు లేకుండా, గతంలో ఇచ్చిన ఉద్యోగోన్నతులను కాదని తాత్కాలిక పని సర్దుబాటు పేరుతో చేపట్టిన బదిలీలను వెంటనే రద్దు చేయాలని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ మజ్జి మదన్మోహన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌పై ఫ్యాప్టో ఆధ్వర్యాన ఉపాధ్యాయులు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సర్వీస్ నిబంధనలను తుంగలో తొక్కి ప్రమోషన్లు ఇవ్వకుండా కాలయాపన చేయడం తగదన్నారు. తాత్కాలికంగా ప్రమోషన్ పోస్టులో పనిచేయాలని ఆదేశాలు ఇవ్వడం నిబంధనలకు విరుద్ధమన్నారు. తక్షణమే కౌన్సెలింగ్ నిర్వహించి ఉద్యోగోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ కె.అప్పలరాజు మాట్లాడుతూ తాత్కాలిక సర్దుబాట్ల ద్వారా రూ.2500 చెల్లిస్తూ ఎస్‌జిటి ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ ఇవ్వకుండా పనిచేయించుకోవడం వెట్టిచాకిరీ కిందకే వస్తుందన్నారు. తక్షణమే ఈ ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధవళ సరస్వతి మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలతో గానీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీలతో గానీ మాట్లాడకుండా చీకటి ఉత్తర్వులు విడుదల చేయడం సరికాదన్నారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ మాట్లాడుతూ జిఒ నంబరు 117 అసంబద్ధాలతో కూడి ఉందన్నారు. దానిపై వ్యాజ్యాలు కోర్టులో ఉండగా దొడ్డిదారిలో ప్రమోషన్లు ఇవ్వకుండా వెట్టి చాకిరీకి తెర తీస్తున్నారని విమర్శించారు.

అసంబద్ధ విధానాలతో విద్యా వ్యవస్థ నాశనం

ఎస్‌సి, ఎస్‌టి టిఎఫ్ ప్రధాన కార్యదర్శి కె.డేనియల్ మాట్లాడుతూ నిబంధనలు లేని వెట్టిచాకిరీతో ప్రమోషన్ పోస్టుల్లో పనిచేయించే విధానానికి స్వస్తి పలకాలన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పొందూరు అప్పారావు మాట్లాడుతూ ప్రమోషన్లు ఇవ్వకుండా తప్పించుకోవడానికే ఇటువంటి విధానాలు అని విమర్శించారు. ఎపిటిఎఫ్ (1938) వాన కామేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి టి.చలపతిరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాల ఐక్యతతో ఇటువంటి అసంబద్ధ విధానాలను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. బిటిఎ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రామారావు, పి.ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ అసంబద్ధ విధానాలతో విద్యా విధానాన్ని నాశనం చేయడం సరికాదన్నారు. ధర్నా అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి జి.పగడాలమ్మకు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు పి.తమ్మినాయుడు, రాష్ట్ర కౌన్సిలర్ సిహెచ్.రామారావు, ప్రధాన కార్యదర్శి ఎస్.వి రమణ, ఆప్టా జిల్లా అధ్యక్షులు ఎస్.గోవిందరాజు, బి.భానుమూర్తి, ఎస్.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఫ్యాప్టో నాయకులు, ఉపాధ్యాయులు

నేనేమి చేశాను 'పాప'ం!

- తుప్పల్లో ఆడ శిశువు
- కాపాడిన స్థానికులు

ప్రజాశక్తి-రణస్థలం

అనుబంధం...అనురాగం.. ఆప్యాయత.. ఇవన్నీ కలిపితేనే అమ్మ. అందుకే సృష్టిలో అమ్మను మించిన దైవం లేదంటారు. ఆమె ప్రేమ గురించి ఎంత చెప్పినా తక్కువే. అలాంటి ఆ తల్లికి ఏమైందో.. ఏం జరిగిందో.. ఏ తల్లికన్న బిడ్డో.. అప్పుడే పుట్టిన పసికందు తుప్పలపాలైంది. ఈ అమానవీయ ఘటన రణస్థలం మండలం కోష్ట గ్రామం పాతర్లపల్లి వద్ద చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి..

పాతర్లపల్లి రోడ్డులోని తుప్పల్లో పసికందు ఏడుపు వినిపించింది. స్థానికులు వెళ్లి చూడగా చలిలో శిశువు ఉన్నట్లు గుర్తించారు. గుర్తుతెలియని మహిళ పాపను విడిచిపెట్టి వెళ్లడంతో వారు మహిళా పోలీసు అమ్మాజీకి సమాచారం అందించారు. ఆమె ఎస్ఐ రాజేష్‌కు సమాచారం చేరవేశారు. ఎస్ఐ తన సిబ్బందితో ఘటనా స్థలికి చేరుకున్నారు. పసికందును తీసుకొని రణస్థలం కమ్యూనిటీ ఆస్పత్రిలో చేర్పించారు. ఆడ శిశువు ఆరోగ్యం బాగానే ఉందని వైద్యులు చెప్పారు. కన్నబిడ్డను ఇలా పారవేయడం నేరగంగా భావించి పోలీసులు కేసును నమోదు చేశారు.



ఆస్పత్రిలో శిశువును చేర్పించిన పోలీసులు

రైస్ మిల్లులను తెరిపించాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మందస మండలంలో సీజ్ చేసిన రైస్‌మిల్లులను వెంటనే తెరిపించి కార్మికులు, రైతులను ఆదుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, కోశాధికారి ఎ.సత్యనారాయణ డిమాండ్ చేశారు. నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మందస మండలంలోని సిద్ధిగాం, రాధాకృష్ణాపురం, సారంగిపురం పరిధిలోని రైస్‌మిల్లుల యజమానులు ప్రభుత్వానికి బ్యాంకు గ్యారంటీలు వెంటనే కట్టి మిల్లులు తెరిపించాలని డిమాండ్ చేశారు.

సిద్ధూరు పరిధిలోని రైస్‌మిల్లు యాజమాన్యాలు బ్యాంకు గ్యారంటీ కట్టలేదని జాయింట్ కలెక్టర్ పర్యటనలో రుజువు కావడంతో సీజ్ చేశారని చెప్పారు. బ్యాంకు గ్యారంటీ కట్టకపోవడానికి కార్మికులు చేస్తున్న ఆందోళనే కారణమని యజమానులు సాకుగా చూపించారని, అది వాస్తవం కాదన్నారు. మిల్లులు సీజ్ చేయడం వల్ల కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులతో పాటు రైతులూ ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

ఈనెల 11న మందస తహశీల్దార్ సమక్షంలో యూనియన్‌కు, యజమానులకు మధ్య నూతన వేతన ఒప్పందం కుదిరిందని చెప్పారు. యజమానులు ప్రభుత్వానికి బ్యాంకు గ్యారంటీ వెంటనే కట్టి జిల్లా అధికారులతో సీజ్ చేసిన మిల్లులు తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిఐటియు మందస మండల ప్రధాన కార్యదర్శి కె.కేశవరావు, శ్రీచైతన్య రైస్ అండ్ ఆయిల్ మిల్లు వర్కర్స్ యూనియన్ నాయకులు జి. లచ్చుమయ్య, పి.తులసిరాజు ఎన్.లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తేజేశ్వరరావు

రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తే తప్పేంటి?

- ప్రభుత్వ భూములు తీసుకుంటే చూపించాలి
- గొంతెత్తే సాధించుకున్నాం
- రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తే తప్పేంటని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఆర్అండ్‌బి అతిథిగృహంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ భూములు తీసుకుంటే చూపించాలని చెప్పారు. ఉత్తరాంధ్రకు ఏమీ చేయలేదని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అనడం సరికాదన్నారు. వంశధార ప్రాజెక్టు, ఎచ్చెర్లలోని బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి తాను గొంతెత్తితే వచ్చినవేనని గుర్తుచేశారు. ఉద్దానం ప్రాంత ప్రజలకు రూ.800 కోట్లతో ఇంటింటికీ రక్షిత మంచినీటిని అందించబోతున్నామని చెప్పారు. పలాసలో అత్యాధునిక ఆస్పత్రి ఏర్పాటు చేస్తున్నామని, బాధితులకు మెరుగైన వైద్యం అందించనున్నామన్నారు. భావనపాడు పోర్టు కోసం ఇప్పటికే భూసేకరణ చేశామని తెలిపారు. మరికొన్ని అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. రాజకీయ వారసత్వం తన కుటుంబానికే ఉండాలనుకోవడం లేదని, అందరూ ఎదగాలన్నది తన ఆకాంక్ష అని అన్నారు. పవన్ కళ్యాణ్ రాజకీయ పార్టీ పెట్టడంపై గౌరవం ఉందని, నడుచుకుంటున్న వైనంపై విభేదిస్తున్నానని చెప్పారు. ఒక వ్యక్తిపై ఆరోపణలు చేసే ముందు పొంతన లేని మాటలు చెప్పడం భావ్యం కాదన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల స్థితిగతులు తెలిసిన వ్యక్తిగా ప్రాంత ప్రజల కోసం గొంతెత్తుతానన్నారు. తాను కాకపోతే మరొకరు వస్తారని ఉత్తరాంధ్ర కోసం పోరాటం ఇంతటితో ఆగదని స్పష్టం చేశారు. శ్రీకృష్ణ కమిషన్, శివరామకృష్ణ కమిషన్ నివేదికలను పవన్ కళ్యాణ్ ఎప్పుడైనా చదివారా అని ప్రశ్నించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

కిడ్నీ రీసెర్చ్ సెంటర్ పరిశీలన

ప్రజాశక్తి - పలాస

కాశీబుగ్గ పరిధిలో నిర్మాణం చేపడుతున్న కిడ్నీ రీసెర్చ్ సెంటర్, 200 పడకల ఆస్పత్రి పనులను సిబిఐ విశ్రాంత జెడి లక్ష్మీనారాయణ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను దత్తత తీసుకున్న కవిటి మండలం సహలాలపుట్టుగ సందర్శనకు వచ్చానన్నారు. నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నట్లు కనిపిస్తోందన్నారు. ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ వ్యాధి బారినపడి వందలాది మంది చనిపోయారని, వ్యాధి ప్రబలడానికి గల కారణాలను అన్వేషించాలని సూచించారు.

కిడ్నీ రోగాలకు తాగునీరు కారణంగా భావిస్తున్న నేపథ్యంలో రూ.700 కోట్లతో ఇంటింటికీ శుద్ధ జలాన్ని అందించేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలు, కిడ్నీ రీసెర్చ్ సెంటర్, 200 పడకల ఆస్పత్రి నిర్మాణంపై ప్రభుత్వాన్ని అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, పలాస ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ కన్వీనర్ డబ్బీరు భవానీ శంకర్, సవర సోమేశ్, బమ్మిడి సంతోష్, యుడిఎఫ్ నాయకులు ప్రేమ్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రి పనులను పరిశీలిస్తున్న లక్ష్మీనారాయణ

పరిహారం చెల్లించాలి

మంత్రి ధర్మానకు ఆఫ్‌షోర్ నిర్వాసితుల వినతి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఆఫ్‌షోర్ ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసినా అర్హులందరికీ పరిహారం చెల్లించలేదని, చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని మెళియాపుట్టి మండలం చీపురుపల్లి పంచాయతీకి చెందిన నిర్వాసితులు రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావును కోరారు. పాతపట్నం నియోజకవర్గ నాయకులు సిరిపురం తేజేశ్వరరావు ఆధ్వర్యాన నిర్వాసితులు పెద్దపాడులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కలిసి వినతిపత్రం అందించారు. ఆఫ్‌షోర్ వల్ల భూమి, ఇళ్లు సర్వం కోల్పోయామని చెప్పారు. ప్రభుత్వం పల్లం భూమికి రూ.2.25 లక్షలు, మెట్టుకు రూ.1.80 లక్షలు ప్యాకేజీగా ఇచ్చినా, అర్హులైన వారందరికీ చెల్లించలేదని వివరించారు. బతుకుదెరువు కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన 80 కుటుంబాలకు ఆర్‌ఆర్ ప్యాకేజీని వర్తింపజేయలేదని చెప్పారు. సుమారు 360 మందికి ఇళ్ల స్థలం లబ్ధి పొందలేదని, వారికి ఐదు సెంట్ల ఇళ్ల స్థలం మంజూరు చేయాలని కోరారు. ఆఫ్‌షోర్ పూర్తయ్యే వరకు 18 ఏళ్ల నిండిన వారికి హిరమండలం వంశధార నిర్వాసితులకు ఇచ్చిన విధంగా యూత్ ప్యాకేజీ ఇవ్వాలన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. మంత్రిని కలిసిన వారిలో ఎవ్వారి ఈశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ పిట్ట సవరయ్య, తెప్ప శ్యామసుందరరావు, చాపర సోమేశ్వరరావు, ఎన్.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.




మంత్రి ధర్మానకు వినతిపత్రం అందిస్తున్న ఆఫ్‌షోర్ నిర్వాసితులు

అంగన్వాడీ కేంద్రం ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

నగరంలోని దండివీధిలో గల అంగన్వాడీ కేంద్రాన్ని పౌర సరఫరాల అధికారి డి.వెంకటరమణ, ఐసిడిఎస్ పీడీ కె.అనంతలక్ష్మి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అంగన్వాడీ కేంద్రానికి పౌర సరఫరాల శాఖ ద్వారా సరఫరా చేసిన కందిపప్పును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నాణ్యమైన కందిపప్పును పిల్లల కోసం అందిస్తోందన్నారు. వీటి నాణ్యతా ప్రమాణాలు, రుచి తదితర వివరాలను తెలుసుకునేందుకు తనిఖీ చేసినట్లు తెలిపారు. పౌర సరఫరాల శాఖ ద్వారా సరఫరా అవుతున్న సరుకులను క్రమం తప్పకుండా పిల్లలు, గర్భిణులకు ఇవ్వాలని ఆదేశించారు. వారితో పాటు ఐసిడిఎస్, సివిల్ సప్లై సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఎస్ఒ వెంకటరమణ

మరిన్ని వార్తల కోసం
epaper.prajasakti.com

క్రికెట్ టోర్నీ విజేత పొందూరు



పొందూరు కబడ్డీ జట్టు

పొందూరు: మండల కేంద్రం సమీపంలోని శ్రీరామనగర్ కాలనీలో నిర్వహించిన కళామందిర్ జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీల్లో శుక్రవారం పొందూరు కబడ్డీ యూత్ జట్టు విజేతగా నిలవగా, రన్నర్‌గా దల్లవలస జట్టు నిలిచాయి. ఎన్ని జగదీష్, గోరు మోహన్‌ల జ్ఞాపకార్థం ఈ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించగా ఇందులో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన సుమారు 45జట్లు పాల్గొన్నాయి. విజేతగా నిలిచిన జట్టుకు స్పాన్సర్ స్థానిక పివియస్ రామ్మోహనరావు రూ.15వేలు నగదు, ట్రోఫీని అందజేశారు. రన్నర్‌కు స్పాన్సర్స్ ప్రదీప్, అనీల్,కార్తీక్‌లు రూ.10వేలు, ట్రోఫీని అందజేశారు. తృతీయ స్థానంలో నిలిచిన గూనానపేట జట్టుకు మోహనరావు రూ.6వేలు, ట్రోఫీని అందజేశారు. మ్యాన్ ఆఫ్ దిమ్యాచ్ నాయుడుకు, మ్యాన్ ఆఫ్‌ది సిరీస్ సునోజ్‌లకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి ప్రతినిధి వడగా మోహన్, నిర్వాహక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఆర్థికసాయం



స్విమ్మింగ్ క్రీడాకారులతో వెంకటరమణ

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ క్రీడా పోటీలకు పయనమైన క్రీడాకారులకు పిడి జి.వినోదిని, వ్యాపారవేత్త బత్తుల వెంకటరమణ స్విమ్మింగ్ షూ, యూనిఫాం, ప్రయాణ ఖర్చులకు రూ.5వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో మంచి ప్రతిభ చూపించి, పతకాలు సాధించాలని కోరారు. శుక్రవారం ఉన్నత పాఠశాలలో వారిని అభినందించారు. కార్యక్రమంలో జోన్‌వన్ ప్రెసిడెంట్ పద్మనాభం, తాజ్ సాజన్, గణేష్, శ్రీను, జోగేష్, కోచ్ బి.రామారావు, తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీలకు బారువ విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సోంపేట: ఈ నెల 19వ నుంచి 23వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి గ్రిగ్స్ పోటీలకు బారువకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు కోచ్ మాధవరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. బారువకు చెందిన యాదం దిలీప్, తెప్పల శ్రీధర్, బడే కృష్ణారావు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరిని ఎస్ఎస్ కబడ్డీ క్లబ్ సభ్యులు, తోటి క్రీడాకారులు అభినందించారు.

స్త్రీనిధి రుణాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - ఆమదాలవలస

గ్రామీణ ప్రాంతంలోని మహిళల కుటుంబ ఆదాయాన్ని మెరుగుపరుచుకోవడానికి గ్రామైక్య సంఘాల ద్వారా స్వయంశక్తి సంఘ సభ్యులకు మంజూరు చేస్తున్న రుణాలను సక్రమంగా వినియోగించుకోవాలని వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు అన్నారు. శుక్రవారం మండలంలోని వంజంగిపేట గ్రామ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళల ఆదాయాభివృద్ధిని పెంపొందించుకోవడానికి ప్రతి సంఘం పంచ సూత్రాలు పాటిస్తూ, నెలవారి సమావేశాలు, సరైన పుస్తక నిర్వహణ చేసుకోవాలన్నారు. పోదుపు డబ్బులు నుంచి మొదటిగా అప్పులు ఇచ్చుకోవాలని, వాటిపైన వచ్చే వడ్డీ సంఘంలోని సభ్యులందరికీ చెందుతుందని తెలిపారు. గ్రామ సంఘాల ద్వారా తీసుకున్న అప్పులపై వచ్చిన వడ్డీలు మన సమాఖ్యలకే చెందుతాయని తెలిపారు. స్త్రీనిధి మహిళా బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలపై వచ్చిన వడ్డీలు మహిళల సంక్షేమానికే ఉపయోగపడతాయని వివరించారు. మన సొంత నిధులు మన అవసరాలకు సరిపడనప్పుడు మాత్రమే మైక్రో క్రెడిట్ ప్లాన్ తయారు చేసుకొని సభ్యుల అవసరం మేరకు బ్యాంకు లింకేజీలు వాడుకోవాలని తెలిపారు. సమావేశంలో గ్రామ సంఘం ప్రతినిధులు, స్వయంశక్తి సంఘాల నాయకులు, విఒఎ చంద్రకళ, క్లస్టర్ కో-ఆర్డినేటర్ రమణ, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

28 నుంచి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

వజ్రపుకొత్తూరు: ఈనెల 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్లు శ్రీ ఊరమ్మతల్లి కబడ్డీ టోర్నమెంట్ నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం కొండవురులో సర్పంచ్ కొల్లి భాస్కరరావు, మాజీ ఎంపిటిసి ఇప్పిలి అప్పన్న మాట్లాడుతూ ఆసక్తిగల జట్లు 9542887464 ,7036163416 నెంబరును సంప్రదించాలని కోరారు. ప్రతి జట్టు ప్రవేశ రుసుం రూ.500 చెల్లించాలని, భోజనం, వసతి కల్పిస్తామని తెలిపారు. ఈ నెల 26 లోపు ఆసక్తిగల జట్లు తమ పేరులు నమోదు చేసుకొని కోరారు. మొదటి బహుమతి రూ.20,000, ద్వితీయ బహుమతి రూ.15000, తృతీయ బహుమతి రూ.10000తో పాటు షీల్డ్అందజేస్తామని తెలిపారు.

ట్రై సైకిల్ వితరణ

వజ్రపుకొత్తూరు: మండలంలోని చినడోకులపాడు గ్రామానికి చెందిన రెయ్యి శారద 8ఏళ్లుగా అంగవైకల్యంతో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న ఉద్దానం హెల్పింగ్ సొసైటీ సభ్యులు రూ.10వేలు విలువ చేసిన చక్రాల కుర్చీ వితరణగా శుక్రవారం అందించారు. సొసైటీ ప్రతినిధి చక్రితో పాటు ఇతర సభ్యులకు ధన్యవాదములు తెలిపారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ వికలాంగుల సంక్షేమం పథకం ద్వారా ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. నిస్సహాయులకు హెల్పింగ్ సొసైటీ తమవంతు సహకారం అందిస్తుంది అన్నారు. కార్యక్రమంలో వినోద్, జోగారావు, రుషి, పాపారావు, కామరాజు, తేజ, శ్యామ్, సోమేష్, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

శ్రీకాకుళం అర్బన్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని నగరంలోని డిసిసిబి కాలనీ గోవిందనగర్‌లో పేదలకు దుస్తులను పంపిణీ చేశారు. డాక్టర్ ఎస్‌పి నాయుడు ఛారిటబుల్ ట్రస్టు తరుపున అధ్యక్షులు సనపల సత్యవతి అందించిన ఆర్థికసాయంతో ఎస్ కన్వెన్షన్, జమిందారి హోటల్ నిర్వాహకులు హనుమంతు ఆర్య, బిర్లంగి రామ్మోహన్ వస్త్రాలను పంపిణీ చేశారు.

నగరంలోని చిన్నబరాటం వీధిలో పేద కుటుంబాలకు 'చేయూత మేమున్నామంటూ' స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన దుస్తులను పట్టణ వర్తక సంఘం నాయకులు కోరాడ హరగోపాల్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు వైశ్యరాజు వెంకటలక్ష్మి, ధనలక్ష్మి, శైలజ, సంగీత తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు..

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ రాజరాజేశ్వరిదేవి సంక్షేమ సంఘం ఆధ్వర్యాన నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఆ సంఘం సభ్యులు మాట్లాడుతూ సంక్రాంతికి ముందు జంట పట్టణాల్లో ఉన్న కుటుంబాలకు నెలకు సరిపడేలా సరుకులు పంపిణీ చేస్తుంటామని చెప్పారు. కార్యక్రమంలో అప్పారావు, శ్రీనివాస్, బాబ్జి, భాస్కరరావు, శ్రీను, గోపి, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలు

ఆమదాలవలస: మండలంలోని రామచంద్రపురం పంచాయతీ పొన్నాంపేట కాలనీలోని రామ మందిరం వద్ద సర్పంచ్ చల్ల ఉష ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య పరీక్షలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నేత్ర వైద్యులు రాబోవు రవిశంకర్ 300 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి అందులో పది మందికి నేత్ర శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. మిగతా వారికి అద్దాలు, మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు రవిశంకర్ మాట్లాడుతూ శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసిన వారికి విజయనగరంలోని నేత్ర వైద్యశాలలో ఉచితంగా ఆపరేషన్ నిర్వహించి, అవసరమైన మందులను, కంటి అద్దాలను ఉచితంగా పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి చల్ల కామేశ్వరరావు, మాజీ సర్పంచ్, ఎఎన్ఎం ఎం.ధనలక్ష్మి, ఆశా కార్యకర్తలు కళావతి, రోహిణి, తదితరులు పాల్గొన్నారు.

భానోజీరావు కాంస్య విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న రవికుమార్

ఆమదాలవలస: మండలంలోని దన్నానపేట గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు గొర్లె బానోజీరావు కాంస్య విగ్రహాన్ని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతిపిన్న వయసులో పార్టీలో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చుకున్నారని, ఇంతలోనే ఇలా జరగడం దురదృకరమని అన్నారు. తెలుగుదేశం పార్టీ పిలుపునిచ్చే కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొని అంకిత భావంతో పనిచేసేవారని గుర్తుచేశారు. జోహార్ జోహార్ అంటూ పెద్దపెట్టున కార్యకర్తలు, అభిమానులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, మెండ దాసు నాయుడు, ముద్దాడ కృష్ణమూర్తి, శివ్వాల సూర్యం, ఎంపిటిసిలు గొర్లె సూర్యం, అన్నెపు భాస్కరరావు, తాడేల రాజారావు, గ్రామస్తులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



నౌపడ : విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ

సంక్రాంతి వేళ క్రీడా సందడి

ప్రజాశక్తి -నౌపడ

క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు, ఆరోగ్యం పెంపొందుతుందని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం సంత మైదానంలో రంగారావు రమేష్ మాస్టర్ జ్ఞాపకార్థంగా పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు ఎమ్మెల్సీ బహుమతుల అందజేశారు. కార్యక్రమంలో రమేష్ మాస్టర్ కుటుంబసభ్యులు, సంతబొమ్మాళి పిఎసిఎస్ ఛైర్మన్ కెళ్లి జగన్నాయకులు, వైస్ఎంపిపి ప్రతినిధులు పొందల రామకృష్ణ, మండల పార్టీ కన్వీనర్ కోత సతీష్, పిఎసిఎస్ డైరెక్టర్ మార్పు నాగభూషణరావు, పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

రణస్థలం: మండలంలోని కొండములగాంలో సర్పంచ్ గొర్లె అప్పలనాయుడు, గొర్లె చైతన్య ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహిస్తున్న వాలీబాల్, క్రికెట్ టోర్నీని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భోగీ, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండగలను ఘనంగా నిర్వహించి, సంతోషంగా ఉండాలని కోరారు. క్రీడలతో ఆరోగ్యంతో పాటు, ఏకాగ్రత పెరుగుతుందన్నారు. క్రీడా స్ఫూర్తితో అందరూ ఆడాలని, గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బిసి కార్పొరేషన్ డైరెక్టర్ కె.వివి.సత్యనారాయణ, వైసిపి ఎచ్చెర్ల మండల అధ్యక్షులు జరుగుళ్ల శంకరరావు, వైసిపి నాయకులు కలిశెట్టి కన్నంనాయుడు, సచివాలయ కన్వీనర్ గొర్లె వెంకటరమణ, వైస్ సర్పంచ్ మజ్జి సూర్యనారాయణ, వైసిపి నాయకులు గ్రామ యువత, తదితరులు పాల్గొన్నారు.

పల్లెలు క్రీడా ప్రాంగణాలు

కవిటి: పల్లెలు క్రీడా ప్రాంగణాలని ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ రజనీకుమార్ దొలై అన్నారు. కీర్తిశేషులు, మాజీ సర్పంచ్ భీమసేన్ దొలై స్మారకార్థం బల్లిపుట్టుగ గ్రామంలో నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలను శుక్రవారం రజనీకుమార్ దొలై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకుల్లో దాగి ఉన్న అత్యుత్తమ ప్రతిభ ఇటువంటి పోటీల ద్వారా బయట ప్రపంచానికి తెలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో బడగల రాజేంద్రం, రమేష్ జెన్నా, కార్తీక్, కిరణ్, మన్మథ దొలై, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడలకు ప్రభుత్వ ప్రోత్సాహం అవసరం

వజ్రపుకొత్తూరు: గ్రామీణ క్రీడలకు ప్రభుత్వ ప్రోత్సాహం ఎంతో అవసరమని మాజీ ఎంపిపి పెద్ద మురారిపురం పంచాయతీ సర్పంచ్ జి.వసంతస్వామి అన్నారు. శుక్రవారం చిన్న మురహరిపురం గ్రామంలో నేను సైతం యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నియోజకవర్గస్థాయి కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంప్రదాయక గ్రామీణ క్రీడలు కనుమరుగవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పోటీల్లో 40 జట్లు పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు. గోవిందపురం జట్టు ఉద్దానం కూర్మనాథపురం జట్టుతో తలపడగా ఉద్దానం కూర్మనాథపురం జట్టు గెలిచింది. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కలిశెట్టి గోపాల్, అగ్నికుల క్షత్రియుల సంఘం మండల అధ్యక్షుడు ఎలమంచిలి భాస్కరరావు, గ్రామ పెద్దలు జి.రామారావు, బచ్చల గన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

ఆమదాలవలస: యువత క్రీడల్లో రాణించాలని వైసిపి నియోజకవర్గ



వజ్రపుకొత్తూరు : పోటీలను ప్రారంభిస్తున్న వసంతస్వామి



రణస్థలం: ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

నాయకులు చింతాడ రవికుమార్ అన్నారు. మూడు రోజులుగా జగనన్న సంక్రాంతి సంబరాల్లో భాగంగా వాలీబాల్, కబడ్డీ, ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వాలీబాల్ క్రీడలో కొర్లకోట టీం మొదటి స్థానం సంపాధించి రూ.50వేలు నగదును సొంతం చేసుకున్నారు. వీరఘట్టం టీం ద్వితీయ స్థానం, పాలకొండ టీం తృతీయ స్థానం, స్టేడియం టీం శ్రీకాకుళం నాలుగో స్థానాన్ని దక్కించుకున్నాయి. బెస్ట్ ఎటాకర్‌గా వీరఘట్టం టీం నుండి సచిన్, బెస్ట్ ఆల్ రౌండర్ కొర్లకోట టీం నుండి తరుణ్, బెస్ట్ లిబిరో శ్రీకాకుళం టీం నుండి మోహన్ సాయి, బెస్ట్ షేట్టర్ పాలకొండ టీం నుండి కృపలను ఎంపిక చేశారు. కబడ్డీ పోటీల్లో సింగుపురం జట్టు మొదటి స్థానం కైవసం చేసుకుని రూ.50 వేలు సొంతం చేసుకుంది. కెఆర్ స్టేడియం శ్రీకాకుళం ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుని రూ.30 వేల బహుమతి పొందింది. ఎస్ఎస్ఆర్ కబడ్డీ క్లబ్ ఇచ్ఛాపురం తృతీయ స్థానంలో నిలిచి, రూ.20వేలు కైవసం చేసుకుంది. ఈ విభాగంలో బెస్ట్ రైడర్ సింగపురం జట్టుకు చెందిన చంగల్‌రావు, బెస్ట్ ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ చంద్రశేఖర్ కన్సోలేషన్ ప్రైజ్ రావికంటిపేటలు సొంతం చేసుకున్నాయి. నవరత్నాల ముగ్గుల పోటీల్లో ఎన్.రమణమ్మ, ఎన్.ఢిల్లేశ్వరి విజేతలుగా నిలిచారు. దంతేశ్వరి, కొర్లకోట గ్రామానికి చెందిన పాతిన గౌతమి తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నది. కొర్లకోట గ్రామానికి చెందిన సిహెచ్.రాజీ నాలుగో స్థానాన్ని కైవసం చేసుకుంది. కన్సోలేషన్ ప్రైజ్ పైడిభవాని అక్కులపేట కైవసం చేసుకున్నది. కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ సెక్రెటరీ పి.సుందర్‌రావు, పిఇటి అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.వి.రమణ, వాలీబాల్ అసోసియేషన్ సెక్రెటరీ వై.పోలినాయుడు, కబడ్డీ అసోసియేషన్ సెక్రెటరీ ఎస్.శ్రీనివాసరావు, మ్యాచ్ రిఫరీలుగా ఎం.తిరుపతిరావు, బొడ్డేపల్లి సురేష్. తదితరులు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ ప్యాకేజీ స్టార్

ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్



మాట్లాడుతున్న దువ్వాడ శ్రీనివాస్

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

పవన్ కళ్యాణ్ ఒక ప్యాకేజీ స్టార్ అని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యువశక్తి బహిరంగసభలో పవన్ చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్రంగా స్పందించారు. రాష్ట్రంలో ఎవరిని ముఖ్యమంత్రిని చేయాలని ఆశ పడుతున్నావని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో జనసేన ఒక్క సీటు కూడా గెలవలేదని ఎద్దేవా చేశారు. ఒంటరిగా పోటీ చేయడానికి దమ్మూ, ధైర్యం, వెన్నెముక లేని రాజకీయాలు చేసే పవన్ కళ్యాణ్ ఒక సీటైనా గెలవగలరా అని ప్రశ్నించారు. ఓ వైపు బిజెపితో పొత్తులో ఉండి మరోవైపు టిడిపితో అంటకాగుతున్న పవన్ బరి తెగింపు రాజకీయం చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో రెండు చోట్లా పోటీచేసి ఎక్కడా గెలవలేకపోయిన పవన్ కళ్యాణ్ తనకు తానే అధికంగా అంచనా వేసుకుంటూ నోరు పారేసుకుంటున్నారని తెలిపారు. యువతకు ఉద్యోగాలు, ఉపాధి అంతా వట్టిదేనని పేర్కొన్నారు. ఒంటరిగా పోటీ చేసినా, పొత్తులతో పోటీకి దిగినా ఎన్నికల్లో చిత్తయ్యే పవన్ కళ్యాణ్ తన పరిధిని దాటి చేస్తున్న ప్రగల్బాలకు అతి త్వరలో జనమే మళ్లీ గుణపాఠం చెప్పనున్నారని దువ్వాడ హెచ్చరించారు.

ఏం మాట్లాడారో పవన్‌కే అర్థం కాదు

వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్



మాట్లాడుతున్న ధర్మాన కృష్ణదాస్

ప్రజాశక్తి - పోలాకి

ప్రజల అవసరాలను తీర్చే ఏకైక వ్యవస్థగా సిఎం జగన్ సచివాలయాలను తీర్చిదిద్దారన్నారు. ఇటువంటి ఆదర్శనీయ సంక్షేమపాలనపై పవన్ కళ్యాణ్ ఏం మాట్లాడుతుంటారో ఆయనకే అర్థం కాని స్థితిలో ఉన్నారని ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. శుక్రవారం పోలాకి మండలం గాతలవలసలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు.అసలు యువతకు ఆయన ఏ విషయంలో ఆదర్శమో చెప్పాలని డిమాండ్ చేశారు. పలువురు ముఖ్యమంత్రుల వద్ద మంత్రిగా బాధ్యతలు నిర్వహించిన ధర్మాన ప్రసాదరావు రాజకీయ. జీవితం కోసం పుస్తకం వేసి చదువుకో అని సూచించారని అన్నారు. సచివాలయ వ్యవస్థ వల్ల గతంలో అపరిష్కతంగా మిగిలిపోయిన సమస్యలు ఒక్కొకొక్కటిగా పరిష్కారం అవుతున్నాయన్నారు. సచివాలయాల పాలనను ఇతర రాష్ట్రాల ప్రభుత్వాలు కూడా ఒక ఆదర్శంగా భావించి అధ్యయనం చేస్తున్నాయని తెలిపారు. అనంతరం గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కె.రాజేశ్వరరావు, వైసిపి నాయకులు ఎం.భైరాదినాయుడు, కణితి కృష్ణారావు, నాయకులు ఎం.భైరాగినాయుడు, కణితి కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

26న ఐఎఫ్‌టియు జిల్లా మహాసభలు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

ఈనెల 26వ తేదీన నగరంలోని ఇలిసిపురంలో గల బి.ఆర్ అంబేద్కర్ విజ్ఞాన్ మందిర్‌లో ఐఎఫ్‌టియు జిల్లా మహాసభలను నిర్వహించనున్నట్లు మహాసభల ఆహ్వాన కమిటీ కన్వీనర్ తాండ్ర ప్రకాష్ తెలిపారు. మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ విజ్ఞాన్ మందిర్‌లో మహాసభల కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో మత విద్వేష పాలన సాగిస్తోందని విమర్శించారు. కార్మికులకు, కర్షకులకు నష్టదాయకంగా నియంతృత్వ పోకడలను అమలు చేస్తోందన్నారు. బిజెపి అడుగులకు రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం మడుగులు ఒత్తుతోందన్నారు. కార్మిక, కర్షక, శ్రామిక వర్గమంతా సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర నాయకులు సన్నశెట్టి రాజశేఖర్, మార్పు మల్లేశ్వరరావు, ఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దుర్గాసి గణేష్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడి క్రాంతి, ఎన్.నీలంరాజు, ప్రగతిశీల మహిళా సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



పోలాకి : ఆత్మీయ కలయికలో 1990 బ్యాచ్ విద్యార్థులు



సంతబొమ్మాళి : నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు



మెళియాపుట్టి : కలుసుకున్న పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' కలయిక

ప్రజాశక్తి - పోలాకి

సంక్రాంతి సెలవులు కావడంతో పలు పాఠశాలలకు చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమతో కలిసి పదో తరగతి చదివిన మిత్రులను కలుసుకొని నాటి మధురస్మృతులను నెమరవేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. కుటుంబాలతో ఆనందంగా గడిపారు. వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

పోలాకి మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కళాశాలలో 1990 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు శుక్రవారం కలుసుకున్నారు. సుమారు 32 సంవత్సరాలు తరువాత కళాశాల వేదికగా ఆత్మీయ కలయిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. కళాశాలలో చదుకున్న రోజులను గుర్తుకుతెచ్చుకున్నారు. ఆనాటి గురువులు గురుమూర్తి, ఆభోతుల ప్రభాకరరావు, రాజు మాస్టర్లు విద్యార్థులంతా ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. పక్షవాతంతో బాధపడుతున్న పూర్వ విద్యార్థి వై.వి రమణకు రూ.లక్ష అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాలకొండ రమణ, లుకలాపు రాంబాబు, దాశెట్టి హేమలత, గోవిందరావు, కిల్లి ఆండాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మండలంలోని పెద్ద లక్ష్మీపురం గ్రామంలో 1879-85 సంవత్సరాల్లో పదో తరగతి పూర్వ విద్యార్థుల కలయిక జరిగింది. ఒకరికొకరు ఆత్మీయకంగా తమ తీపి గుర్తులను గుర్తు చేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు నిత్యానంద సాహు, బంధన శ్రీనివాసరావు, సిమ్మన్న, లింగాల సంజీవరావు, కాంతారావును సన్మానించారు. జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో నర్సీపట్నం మెడికల్ ఆఫీసర్ దామోదర్ ప్రధాన్, ఎంపిడిఒ పి.చంద్రకుమారి, ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్‌కుమార్, ఎంఇఒ ఎస్.దేవేంద్రరావు, హెచ్ఎంలు రమణమూర్తి, ఎన్.సీతారాం,, సుందరరావు, టంకాల రామారావు, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



కింతలిలో 1995-96 పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు

సంతబొమ్మాళి: బోరుభద్ర ఉన్నత పాఠశాలలో 1994-99 వరకు 6వ తరగతి నుండి 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల అపూర్వ ఆత్మీయ కలయిక శుక్ర వారం జరిగింది. 24 ఏళ్ల క్రితం విద్యాబోధన చేసిన లెక్కలు టీచర్ టి.వి.రమణమూర్తి, ఆదిరాజు, నారాయణరావు, హిందీ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, పద్మావతి, తెలుగు ఉపాధ్యాయులు మెండ కృష్ణంనాయుడు, జీవ శాస్త్రం ఉపాధ్యాయులు నర్సునాయుడును పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించి, వారి సేవలు కొనియాడారు. స్థానిక ప్రధాన ఉపాధ్యాయులు టి.వి.రమణ మూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో గురువులు గొప్పతనాన్ని, చేసిన సేవలను పూర్వ విద్యార్థులు కొనియాడారు. సమాజంలో మార్పు రావాలంటే అది గురువులు వలనే సాధ్యమవుతుందని అన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గిన్ని అప్పలరాజు, గిరిబాబు, కూస మల్లేశ్వరరావు, సూరాడ జోగారావు, దుపాన వనిత, కుమారి, జానికమ్మ, సునీత, రజినీ, హేమలత పాల్గొన్నారు.

పొందూరు: మండలంలోని కింతలి జెడ్‌పి ఉన్నత పాఠశాలలో 1995-96 సంవత్సరంలో పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక శుక్రవారం సందడిగా జరిగింది. వివిధ పోటీలలో పాల్గొని సందడి చేశారు. అప్పట్లో తమకు బోధించిన ఉపాధ్యాయులు గురుగుబెల్లి అప్పన్న, ప్రసాదరావు, బాడాన వెంకటనాయుడు, పకీర్, గోవిందరావు మాష్టర్లుకు దుశ్శాలువ కప్పి పుష్పగుచ్చాలతో ఘనంగా సన్మానించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

వైసిపి ప్రభుత్వాన్ని ప్రజలే కూల్చేస్తారు

కవిటి: అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి జిఒకు న్యాయస్థానం మొట్టికాయలు వేస్తున్నా ప్రభుత్వానికి సిగ్గులేదని, కూల్చివేతలతో ప్రారంభమైన వైసిపి పాలన మరికొద్ది రోజుల్లో ఓటు అనే ఆయుధంతో కూల్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే బెందాళం అశోక్ జోస్యం చెప్పారు. మండలంలోని బెజ్జిపుట్టుగ గ్రామంలో శుక్రవారం ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జిఒ 1ని సస్పెండ్ చేసిన హైకోర్టు ప్రజలకు న్యాయస్థానంపై నమ్మకం కలిగేలా చేసిందన్నారు. మరోవైపు రోజురోజుకీ ప్రభుత్వంపై పెరుగుతున్న అసంతృప్తిని చూసి వైసిపి నాయకులకు బూతులు తన్నుకొస్తున్నాయని ఎద్దేవా చేశారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ వైఫల్యాలు వివరించారు. మూడున్నర ఏళ్లుగా రాష్ట్రం తిరోగమనంలో పయనిస్తోందని, ప్రజలు అభివృద్ధి అనే మాట ఎప్పుడో మరిచిపోయారని ఎమ్మెల్యే అన్నారు. చివరకు తాను పండించిన ధాన్యం అమ్ముకునేందుకు కూడా రైతులు నెలల తరబడి వేచిచూసే పరిస్థితికి తీసుకువచ్చారని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మానిచంద్ర ప్రకాష్, పొందల కృష్ణారావు, సీపాన వెంకటరమణ, బెందాళం రమేష్, యర్రా బాసుదేవ్ ప్రధాన్, బాసుదేవ్ రౌలో, లోళ్ల శ్రీను, బార్ల చినబాబు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - బూర్జ

మండలంలోని సింగన్నపాలెం గ్రామ జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ అశోక్ బాబు తెలిపారు శ్రీకాకుళం నుండి పనులు ముగించుకొని స్వగ్రామం తుద్దలి ద్విచక్ర వాహనంపై వస్తున్న కె.వెంకన్నను లారీ ఢీకొనడంతో శ్రీకాకుళంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు ఆయన చెప్పారు. మృతునికి భార్య సత్యవతి, కుమారుడు జగదీష్, కుమార్తె జ్యోత్స్న ఉన్నారు పాలకొండ యూనియన్ బ్యాంకులో సహాయక ఉద్యోగిగా పనిచేస్తున్న వెంకన్న మృతిపై బ్యాంకు సిబ్బంది, గ్రామస్తులు నివాళులర్పించారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - రణస్థలం రూరల్

మండల కేంద్రంలోని మహాలక్ష్మినగర్‌కు చెందిన వ్యాపార వేత్త వెలిచేటి ఫల్గుణరావు, గరికిపాలెంకు చెందిన డాక్యుమెంటరీ రైటర్ గుగ్గిలపు చిన్నారావు ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శుక్రవారం మృతుల కుటుంబసభ్యులను పరామర్శించారు. వారి మృతికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. ప్రగాడ సానుభూతిని తెలిపారు. పరామర్శించిన వారిలో జెఆర్.పురం సర్పంచ్ భవిరి రమణ, ఎంపిటిసి పచ్చిగుళ్ల సాయిరాం, వైస్ సర్పంచ్ దన్నాన సీతారాం, బ్రహ్మాజీ, సాయి, ఫణికుమార్, మాదాసు రాజు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

చిరు అభిమానుల హంగామా



ఇచ్ఛాపురం : కేకు కట్ చేస్తున్న అభిమానులు

ఇచ్ఛాపురం: మెగాస్టార్ చిరంజీవి నటించిన వాల్తేరు వీరయ్య సినిమా విడుదల సందర్భంగా ఇచ్ఛాపురం పూర్ణా థియేటర్ వద్ద శుక్రవారం ఉదయం హంగామా చేశారు. అభిమానులకు కావాల్సిన మాస్ మసాలా అన్ని హంగులతో సినిమా విడుదల కావడంతో ఉదయం నుండే థియేటర్ వద్ద అభిమానులు మారులు తీరారు. వాల్తేరు వీరయ్య పేరు మీద తెచ్చిన కేకును ప్రముఖ వైద్యులు డాక్టర్ నర్తు శేషగిరి, ఆలీం ఖాన్ కట్ చేసి అభిమానులకు పంచి పెట్టారు. బాణసంచా కాలుస్తూ సందడి చేశారు. చిత్రంలో చిరంజీవి నటన, అభినయానికి హాల్‌లో కేరింతలు, విజిల్స్‌తో మారుమోగింది. ఇచ్ఛాపురం అభిమానుల సంఘం అధ్వర్యంలో జరిగిన కార్యక్రమం లో అభిమానులు జనార్ధనరెడ్డి, దాసరి అజయ్,,సుగ్గు ప్రేమ్‌కుమార్, బాలు, దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వాల్తేరు వీరయ్య చిత్రానికి అపూర్వ ఆదరణ

శ్రీకాకుళం అర్బన్: చిరంజీవి నటించిన వాల్తేరు వీరయ్య సినిమా అఖండ విజయం సాధించాలని ఫోకస్ చిత్రం హీరో విజయ్ శంకర్ కోరారు. అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో స్వామివారి సేవల్లో పాల్గొన్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలుగు సినీ పరిశ్రమలో చిరంజీవి అందరి మేలు కోరే వ్యక్తి అని, ఆయన నటుడి గానే కాక సామాజికవేత్తగా ప్రజల ఆదరణ పొందగలిగారన్నారు. అనంతరం నగరంలో వాల్తేరు వీరయ్య సినిమా ప్రదర్శిస్తున్న సరస్వతి థియేటర్‌లో అభిమానులతో కలసి ఆయన తిలకించారు.

యువతకు లక్ష్మణ్ ఆదర్శం

కవిటి: యువతకు ఆదర్శం బిడి లక్ష్మణ్ అని బెంతు ఒరియా కుల పెద్దలు పేర్కొన్నారు. ఎన్‌జిపిసిలో రైల్వే స్టేషన్ మాస్టర్‌గా లక్ష్మణ్ ఉద్యోగం సంపాధించడంపై ఆ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం రాత్రి ఆయనను సన్మానించారు. లక్ష్మణ్ భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మణ్ తల్లిదండ్రులు లోకనాథం, కిరమణి, పెద్దలు బి.భగీరథి, అంతర్యామి, జగన్నాథ్, హరికృష్ణ, గోదావరి సాహు, తదితరులు పాల్గొన్నారు.

సపోటా తోట ధ్వంసం



బూర్జ: మండలంలోని వుప్పునివలస గ్రామంలో సపోటా తోట ధ్వంసమైనట్లు ఫిర్యాదు వచ్చిందని ఎస్ఐ అశోక్‌బాబు తెలిపారు. గ్రామానికి చెందిన కపిల్ మోహన్‌రావుకు చెందిన 80 సెంట్లలో 33 సపోటా చెట్లు ఉన్నాయి. గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులువాటిని ధ్వంసం చేసినట్లు బాధితులు పోలీసులకు తెలిపాడు.

లక్ష్మనాయుడు సేవలు చిరస్మరణీయం

గార: తీర ప్రాంత మత్స్యకారులకు కిలుగు లక్ష్మనాయుడు అందించిన సేవలు చిరస్మరణీయమని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. గార మండలం కళింగపట్నంలో లక్ష్మనాయుడు సంతాప సభలో ఆయన చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవితో పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు మెండ దాసునాయుడు పాల్గొన్నారు.

టిడిపి తూర్పు కాపు సాధికార కమిటీ

అధ్యక్షులుగా సురేష్

శ్రీకాకుళం అర్బన్: తెలుగుదేశం పార్టీ తూర్పు కాపు సాధికార కమిటీ అధ్యక్షులుగా పల్లి సురేష్‌ను నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ ప్రకటన విడుదల చేశారు. 15 మందిని కమిటీ సభ్యులుగా నియమించారు.

దర్యాప్తునకు సిద్ధం

నందిగాం: మండలం దిమ్మిడిజోల పంచాయతీలో సర్పంచ్‌గా సాలాన దేవమ్మ బాధ్యతలు చేపట్టిన నాటి నుండి గ్రామాభివృద్ధికి పాటు పడ్డానని, కొందరు వైసిపి నాయకులు నాపై చేసిన అసత్య ఆరోపణలపై దర్యాప్తుకు సిద్ధంగా ఉన్నానని అన్నారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామానికి చెందిన వైసిపి నాయకులు తనపై అవినీతి ఆరోపణలు చేస్తూ మాట్లాడారని, అటువంటివి ఉంటే చర్యలు తీసుకోవాలని కోరారు.

చీరల పంపిణీ

పొందూరు: పట్టుశాలి కళ్యాణ మండపంలో పట్టుశాలి సంక్షేమ సంఘం అధ్యక్షులు మలిపెద్ది శ్రీరంగనాయకులు ఆధ్వర్యంలో శుక్రవారం నిరుపేద కుటుంబాలకు చీరలు పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా దాతల సహకారంతో పట్టుశాలి కుల బందువుల్లో 100మంది నిరుపేద కుటుంబాలకు చీరలను పంపిణీ చేశారు. కళ్యాణ మండపం అధ్యక్ష, కార్యదర్శిలు డి.వి.యస్ ప్రకాశరావు, జి.సత్యారావు, ప్రధాన కార్యదర్శి పి.ప్రకాశరావు, ఉపాధ్యక్షులు బి.మన్మథరావు, జాయింట్ సెక్రటరీ కృష్ణారావు, ట్రెజరర్ వి.సూర్యారావు, జిల్లా ఉపాధ్యాక్షులు కె.విజయ్‌కుమార్, మాజీ సర్పంచ్ కె.జయలక్ష్మి, ఎంపీటీసీ వి.పద్మ, మాజీ ఎంపీటీసీ కె.సాయికుమార్, పెద్దలు డి.సూరిబాబు, మణిభూషణరావు, పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

పలాస: కాశీబుగ్గ షిరిడి సాయిబాబా మందిరం ఆవరణలో పలాస క్యాజు ల్యాండ్ వనిత ఆధ్వర్యంలో సంక్రాంతి, లయన్స్ మెలివిన్ జాన్స్ పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం మున్సిపల్ ఛైర్మన్ బల్ల గిరిబాబు నిరు పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు దుస్తులు పంపిణీ చేపట్టడం ఆనందంగా ఉన్నారు. నిరుపేదలకు అండగా నిలవడం సాధారణ విషయం కాదన్నారు. సుమారు 40 మందికి దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.రాజగోపాల్, లైయన్స్ క్లబ్ క్యాజు ల్యాండ్ వనిత అధ్యక్షులు మల్లా జయశ్రీ, కార్యదర్శి శ్వేతకుమారి, గ్రూప్ సభ్యులు డాక్టర్ జ్యోత్స్న, డాక్టర్ జయలక్ష్మి గాయత్రి, ఆర్‌సి మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల ఇంటికి ఆహారం

పలాస: జంట పట్టణాలలో ఉన్న 72 మంది నిరుపేదలకు లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటికీ వెళ్లి ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. ముందుగా ఇంటర్నేషనల్ లైన్స్ క్లబ్ వ్యవస్థాపకులు మెల్విన్ జోన్స్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలేసి, నివాళులర్పించారు. పలాస లయన్ క్లబ్ సభ్యులు ఎల్.ఢిల్లేశ్వరరావు ఆర్థిక సాయంతో పేదలకు ఆహారం పంపిణీ చేశామని సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కణితి విశ్వనాథం, కుమార్‌నాయక్, కె.పెద్దరమ్మన్న, అప్పారావు, హేమాచలం పాల్గొన్నారు.

అడ్‌హక్ కమిటీ సంయుక్త కార్యదర్శిగా రామునాయుడు

రణస్థలం: శ్రీకాకుళం జిల్లా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం అడ్‌హక్ కమిటీని నూతనంగా ఏర్పాటు చేశారు. కోష్ట సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పిల్ల రామునాయుడు జిల్లా కమిటీ సంయుక్త కార్యదర్శిగా ఎంపికయ్యారు. ఆయన మాట్లాడుతూ సచివాలయం ఉద్యోగుల సమస్యలపై నిరంతరం వారి సేవల్లో ఉంటానని అన్నారు.

మురిపించే ముందస్తు సంబరం



టెక్కలి రూరల్ : భోగి మంట వద్ద విద్యార్థుల సందడి

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ముందస్తు సంక్రాంతి సంబరాలు అంబరాన్ని తాకాయి. కళాశాల డైరెక్టర్ వివి.నాగేశ్వరరావు, కార్యదర్శి ఎల్.ఎల్.నాయుడు, కోశాధికారి టంకాల నాగరాజు, యాజమాన్య సభ్యులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి, వేడుకల్లో పాల్గొన్నారు. విభాగాల వారిగీ విద్యార్థినులు వేసిన రంగవల్లిలు పలువుర్ని ఆకట్టుకున్నాయి. దివ్వల మాధురి ఆధ్వర్యాన చిన్నారుల కోలాటం ఆకట్టుకుంది. కోటబొమ్మాళి మండలం పొన్నాన పేటకు చెందిన యడ్ల పోలయ్య గంగిరెద్దుల బృందం చేసిన విన్యాసాలు, నరసన్నపేటలోని మేడపాటి జగన్నాథ బృంద సభ్యుల సాముగారిడీ, వాల్తేరు వాసి బోనెల అసిరయ్య జమికీ పాట ఆబాల గోపాలాన్ని అలరించాయి. సాంప్రదాయ కళల ప్రదర్శనతో పాటు విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలతో కళాశాల ప్రాంగణం మారుమోగింది. అంతరించిపోతున్న కళలను, మన సంస్కృతిని విద్యార్థులకు తెలియజేసేందుకే ఈ సంబరాలు నిర్వహించినట్లు తెలిపారు. రంగవల్లిలు, ఇతర సాంస్కృతిక అలంకరణలో మొదటి బహుమతి మెకానికల్ విభాగానికి, ద్వితీయ బహుమతి ఈఈఈ విభాగాలు గెలుచుకొన్నాయి. యాజమాన్యం వారికి నగదు బహుమతులను అందజేశారు. భరతనాట్యాన్ని స్వచ్ఛందంగా ప్రోత్సహిస్తున్న దివ్వల మాధురిని శాలువతో సత్కరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్లు, హెచ్ఐడిలు, డాక్టర్ చింతాడ రాజశేఖరరావు, జె.సురేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు సంబరాలు జరుపుకున్నారు. చిన్నారులు తెలుగు వారి వైభవాన్ని చాటి చెప్పే రీతిలో ముస్తాబయ్యారు. గంగిరెద్దులాటలు, గొబ్బెమ్మలు, ముగ్గుల పోటీలు, వేషదారణ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

నందిగాం: మండలం పెద్ద తామరపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆవరణలో ప్రధానోపాధ్యాయులు బాలక శంకరరావు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు ఇందులో భాగంగా ముందుగా విద్యార్థులతో భోగిమంట వేయించి భోగిమంట వాటి ప్రాముఖ్యతను వివరించారు దీనితో పటు వివిధ సాంస్కతిక కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులను అలరింపజేశారు ఈ కార్యక్రమంలో సహ ఉపాధ్యాయులు కుమారి తదితరులు ఉన్నారు



టెక్కలి రూరల్: నృత్యం చేస్తున్న విద్యార్థినులు



నందిగాం: భోగి మంట వేస్తున్న హెచ్‌ఎం శంకరరావు

పరిశుభ్రత అవసరం

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

సంక్రాంతి పండగ నేపథ్యంలో వీధులు, గ్రామాలు పరిశుభ్రంగా ఉంచాలని గ్రామస్థులకు మేజరు పంచాయతీ సర్పంచ్ కాళ్ల సంజీవరావు సూచించారు. ఆయన శుక్రవారం పంచాయతీ కార్యదర్శి రఘుపాత్రుని యోగేశ్వరరావుతో కలిసి పంచాయతీ పరిధిలోగల 1, 2, 3 వార్డులు, బంజీరుపేట గ్రామంలో పర్యటించి గ్రామంలో దగ్గరుండి పారిశుధ్య పనులు నిర్వహించారు. పండగ దృష్ట్యా బంధువులు ఇళ్లకు వస్తుంటారని, చెత్తాచెదారం రోడ్లపై వేయకుండా చెత్త బండికి ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకుడు ఇర్రి చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథపురంలో పారిశుధ్య పనులు

సంతబొమ్మాళి: జగన్నాథపురంలో సర్పంచ్ జోగి రాములమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం పారిశుధ్య పనులు నిర్వహించారు. కాలువల్లో పూడిక తీత తీశారు. గ్రామంలో చెత్తాచెదారం ఎత్తి గ్రామానికి దూరంగా వేశారు. కాలువల్లో బ్లీచింగ్ చల్లారు. కార్యక్రమంలో మత్స్యకార సొసైటి అధ్యక్షుడు పుక్కళ్ల లక్ష్మణరావు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

గరుడభద్ర లో..

వజ్రపుకొత్తూరు: గరుడభద్ర పంచాయతీ పరిధిలో ఉన్న మర్రిపాడు, హరిజనపేట, టి.గడూర్, గరుడభద్ర గ్రామంలో సర్పంచ్ గూడ గిరిజ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులను శుక్రవారం చేపట్టారు. బుల్డోజరుతో చెత్తను తొలగించారు. బ్లీచింగ్ చల్లారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.మోహన్, గ్రామ సంఘం అధ్యక్షులు వై.ధర్మారావు, వార్డ్ సభ్యులు చెల్లురు ధనరాజ్, పి.భీమారావు, ఆర్.విజయలక్ష్మి, ఉప సర్పంచ్ ఎం.పార్వతి, ఎం.చందు, సచివాలయ సిబ్బంది శ్రీకాంత్, అవినాష్, శ్రీను, వెంకటేష్ పాల్గొన్నారు.



కోటబొమ్మాళి: మాట్లాడుతున్న సంజీవరావు

మార్కెట్ కిటకిట

కొత్తూరు: సంక్రాంతి పండగ సందర్భంగా కొత్తూరు మార్కెట్ కిటకిటలాడింది. మండల కేంద్రంతోపాటు మన్యం జిల్లా భామిని మండలం, సీతంపేట మండలం, ఒడిశా రాష్ట్ర సరిహద్దు గ్రామాల నుండి ఏ చిన్న అవసరం వచ్చినా కొత్తూరు వస్తుంటారు. పండగ కావడంతో శుక్రవారం మార్కెట్ కళకళ లాడింది. దీంతో బత్తిలి రోడ్డులో రాకపోకలకు అంతరాయం కలిగింది.



సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షునిగా 'ధవళ'

ప్రజాశక్తి - ఆమదాలవలస

సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షునిగా ధవళ జానకిరాంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూన వెంకట సత్యనారాయణ తెలిపారు. గురువారం శ్రీకాకుళం జెడ్‌పి పాత గెస్ట్‌హౌస్‌లో జరిగిన సమావేశంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడిని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా దవళ జానకిరామ్ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. అందరినీ కలుపుకొని ఏకతాటిపై సమస్యల పరిష్కారం కోసం పోరాడుతానని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యదర్శి గుంటు తిరుపతిరావు, జిల్లా అధ్యక్షులు ఐ.నారాయణరావు, ఉపాధ్యక్షులు సంతోష్, జడ్పీ యూనిట్ అధ్యక్షురాలు జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేయాలి



నందిగాం: మాట్లాడుతున్న ఎంపిపి శ్రీరామ్మూర్తి

ప్రజాశక్తి - నందిగాం

పూర్తిస్థాయిలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని నందిగాం ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నందిగాం మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం ఎఒ పి.శ్రీకాంత్ వర్మ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ రైతులకు ఇబ్బంది లేకుండా మిల్లర్లతో మాట్లాడి సకాలంలో ధాన్యం మిల్లులో దించేలా చూడడంతో పాటు పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రబీలో వరి సాగు చేస్తున్న దృష్ట్యా ఇకెవైసి చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ నందిగాం శ్యాంసుందరరావు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, ఇఒపిఆర్‌డి రాజారావు, తదితరులు పాల్గొన్నారు

మెళియాపుట్టి: రైతులు పెసర, మినుము, నువ్వులు, రాగులు వంటి పంటలు వేసుకొని ఆర్థికంగా లాభపడాలని వ్యవసాయశాఖ ఎడి మధుబాబు అన్నారు. శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశం పరశురాంపురం ఆర్‌బికెలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంటల మార్పిడి విధానాన్ని పాటించి, అధిక దిగుబడులు పొందాలన్నారు. కారక్రమంలో వైస్ ఎంపిపి ఆదినాయుడు, తహశీల్దార్ పి.సరోజని, ఎఒ దానఖర్ణుడు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులతో మమేకం అవ్వండి

కవిటి: వ్యవసాయ, ఉద్యానవన సహాయకులు రైతులతో మమేకమై క్షేత్రస్థాయిలో రైతులకు అండగా ఉండాలని ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, దువ్వు కృష్ణారెడ్డి అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా సంఘం సమావేశం శుక్రవారం నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ ఇప్పటికీ మండలంలోని చాలా గ్రామాల్లో ధాన్యం కళ్లాల్లోనే ఉందన్నారు. వ్యవసాయ శాఖ సహాయకులు ఎప్పటికప్పుడు మిల్లర్లు, రైతులను సమన్వయం చేసుకుంటూ వేగంగా కొనుగోలు జరిగేలా చూడాలని సూచించారు. సమావేశంలో పిఎసిఎస్ అధ్యక్షుడు దేవరాజ్ సాహు, ఎంపిటిసి పూడి నీలాచలం, మాజీ సర్పంచ్ బెందాళం వెంకటేశ్వరరావు, డిటి రామచంద్రరావు, ఉద్యానశాఖ అధికారి పి.మాధవీలత, వ్యవసాయశాఖ అధికారి ప్రసాదరావు, మండలంలోని వ్యవసాయ, ఉద్యానశాఖ సహాయకులు పాల్గొన్నారు.

సోంపేట: రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు అధికారులు చర్యలు వేగవంతం చేయాలని వ్యవసాయ సలహా మండలి సభ్యులు కోరారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయశాఖ ఎడి కె. జగన్మోహన్‌రావు అధ్యక్షతన సలహా మండలి సమావేశం నిర్వహించారు. సభ్యులు బి.లోకనాథం, జి.ధర్మారావు, బి.మాధవరావు మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులకు కలగకుండా ధాన్యం కొనుగోలు జరపాలన్నారు. అనంతరం ఎఒ నరసింహమూర్తి మాట్లాడుతూ ప్రస్తుతం మండలానికి 10 క్వింటాళ్ల నువ్వులు, నాలుగు క్వింటాళ్ల చోడు విత్తనాలు సరఫరా చేయడం జరిగిందన్నారు. ఇప్పటివరకు 22 ఆర్‌బికెల ద్వారా 990 మంది రైతులు నుంచి 3800 టన్నుల ధాన్యం కొనుగోలు జరపడం జరిగిందన్నారు. సమావేశంలో అధికారులు, సలహా మండలి సభ్యులు పాల్గొన్నారు.